సాక్షి
మంచిర్యాల

మంగళవారం । 8 । ఏప్రిల్ । 2025



మరో తడిపై రైతుల ఆశలు

సదర్‌మట్ ఆయకట్టుకు ఏప్రిల్ 9వ తేదీతో ఏడు నీటితడులు పూర్తికానున్నాయి. దీంతో నీటి విడుదల నిలిపివేయనున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. 8లో



కరెన్సీ సేకరణే హాబీగా.. 8లో

లక్సెట్టిపేట మండలం లక్ష్మీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అనిల్ వివిధ దేశాల కరెన్సీ సేకరణ హాబీగా ఎంచుకున్నారు. ఇప్పటివరకు 31 దేశాల కరెన్సీ నోట్లు సేకరించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
38.0 /25.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

తహసీల్దార్ సస్పెన్షన్

- ధరణి ఆపరేటర్‌పైనా వేటు
- 'సాక్షి' కథనంతో బాధ్యులపై చర్యలు

సాక్షిప్రతినిధి, మంచిర్యాల: బతికుండగానే చనిపోయినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన రెవెన్యూ అధికారులపై వేటు పడింది. ఈ వ్యవహారంలో నెన్నెల మండల తహసీల్దార్ రమేశ్‌ను సస్పెండ్ చేయగా.. ధరణి ఆపరేటర్‌గా ఉన్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఉదయ్‌ను సర్వీస్ నుంచి శాశ్వతంగా తొలగించారు. 'బతికుండగానే చంపేశారు' శీర్షికన ఈ నెల 5న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా బాధ్యులపై వేటు వేస్తూ చర్యలు తీసుకున్నారు. గత కొద్ది రోజులుగా తహసీల్దార్ సెలవులో ఉన్నారు. ఇక ఆపరేటర్ స్థానంలో మరొకరిని నియమించారు. మరోవైపు కుందూరు శ్రావ్యరెడ్డి మామ అశోక్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల విభాగంలో కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి తన కోడలు బతికుండగానే చనిపోయినట్లుగా రికార్డులు నమోదు చేసిన సమాచారంతోపాటు ఆ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకున్నామని, తిరిగి మీ భూమి రిజిస్ట్రేషన్ చేశామని బదులిచ్చారు.

'బీఆర్‌ఎస్ సభ విజయవంతం చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఈ నెల 27న వరంగల్‌లోని కేసముద్రంలో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు పెద్దయెత్తున తరలిరావాలని కోరారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, మాజీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి, అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని భగవంతం వాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా వ్యాధులు, కంటి పరీక్షలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని 60 మంది పిల్లలకు పరీక్షలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి అర్పితరెడ్డి, జిల్లా ఉపవైద్యాధికారి ఎస్.అనిత, జిల్లా ఇంచార్జి సంక్షేమ శాఖ అధికారి రాజేశ్వరి, డెమో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం



టీచర్లను మందలిస్తున్న డీఈవో యాదయ్య

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి పరీక్ష జవాబు పత్రాల మూల్యాంకనం సోమవారం స్థానిక ఏసీసీ కార్మెల్ హైస్కూల్‌లో ప్రారంభమైంది. ఉపాధ్యాయులు ఉదయం 8గంటలకు రిపోర్ట్ చేయాల్సి ఉండగా మధ్యాహ్నం వరకు రాకపోవడంతో మూల్యాంకనం ఆలస్యమైంది. రిపోర్టు చేయని టీచర్లకు నోటీసులు జారీ చేస్తామని మైకులో హెచ్చరించినా పెడచెవిన పెట్టారు. అనారోగ్యం, ఇతర అత్యవసర కారణాలు చూపుతూ విధులకు దూరంగా ఉండేందుకు పడరాని పాట్లు పడ్డారు. మధ్యాహ్నం తర్వాత మూల్యాంకనం మొదలైంది. ఇతర జిల్లాల నుంచి ఆయా పరీక్షలకు సంబంధించిన 1,29,281 జవాబు పత్రాలు మూల్యాంకన కేంద్రానికి చేరాయి. మొదటి రోజు 7280 పేపర్లు మూల్యాంకనం చేశారు. అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు 7, చీఫ్ ఎగ్జామినర్లు65, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 390, స్పెషల్ అసిస్టెంట్లు 130మంది మూల్యాంకన విధులకు హాజరయ్యారు.

డ్యూటీ చేస్తారా.. వెళ్లిపోతారా..?

రిపోర్టు చేయకుండా చెట్ల కింద, వరండాలో తిరుగుతున్న ఎగ్జామినర్లను డీఈవో యాదయ్య మందలించారు. మధ్యాహ్న సమయం దాటినా హిందీ, బయోసైన్స్ టీచర్ల కొరత కనిపించింది. చాలామంది విధుల ఉత్తర్వులు రద్దు చేయించుకునేందుకు అనేక ప్రయత్నాలు చేశారు. సమయం దాటిపోతున్నా రిపోర్ట్ చేయని టీచర్ల వద్దకు డీఈవో వెళ్లి డ్యూటీ చేస్తారా.. వెళ్లిపోతారా అంటూ మందలించారు.

టైగర్ ఫోర్స్‌కు సన్నద్ధం

- రాష్ట్రంలో పులుల రక్షణకు చర్యలు
- 'కవ్వాల్'లోనూ ముప్పులో పెద్దపులులు
- రక్షక దళం ఏర్పాటైతే వేట తగ్గే అవకాశం



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: పులుల సంరక్షణకు రాష్ట్ర అటవీ శాఖ టైగర్ ఫోర్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. దీంతో 'కవ్వాల్' టైగర్ రిజర్వు మరింత పటిష్టం కాబోతోంది. ఏటా ఉమ్మడి జిల్లా పరిధిలోకి అనేక పులులు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం ఏడు నుంచి ఎనిమిది పులుల వరకు సంచరిస్తున్నాయి. ప్రసిద్ధ బెంగాల్ టైగర్లు ఇక్కడ సంచరించాయి. కోర్ ఏరియా వరకు వెళ్లకుండా కారిడార్ ప్రాంతాల్లోనే సంచరిస్తున్నాయి. మహారాష్ట్రలోని తడోబా అంధేరి, తిప్పేశ్వర్, ఛత్తీస్‌గఢ్‌లోని ఇంద్రావతి అభయారణ్యం నుంచి రాకపోకలు సాగించే అవకాశం ఉంది. పెన్‌గంగా, ప్రాణహిత నదులు దాటి ఉమ్మడి జిల్లాకు అడుగుపెడుతున్నాయి. ఈ పులులకు వేట ముప్పు పొంచి ఉంది. ఈ క్రమంలో ఇక్కడ పులులను కాపాడుకోవాలంటే మరింత నిఘా అవసరం ఏర్పడింది. మంచిర్యాల జిల్లాలో మొత్తం భౌగోళిక ప్రాంతంలో అటవీ 41.09శాతం విస్తరించి ఉండగా, కుమురంభీం ఆసిఫాబాద్‌లో 40.24, ఆదిలాబాద్‌లో 29.51, నిర్మల్‌లో 29.83శాతాల్లో విస్తరించి ఉంది. 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్టు' 2022 రిపోర్టు ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో 115.50, నిర్మల్‌లో 45.34చ.కి.మీ.చొప్పున అటవీ విస్తీర్ణం తగ్గినట్లు తేలింది. ఈ క్రమంలో వన్యప్రాణులు, అడవుల సంరక్షణ, పచ్చదనం పెంపు టైగర్‌ఫోర్స్ ఏర్పాటుతో ఉమ్మడి జిల్లా అడవుల రక్షణకు దోహదం చేసే అవకాశాలు ఉన్నాయి.

ఎన్నో ఏళ్లుగా డిమాండ్లు

టైగర్ రిజర్వులు ఉన్న రాష్ట్రాల తరహాలో ఇక్కడ కూడా టైగర్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏర్పాటు చేయాలనే డిమాండ్లు ఉన్నాయి. కవ్వాల్ పరిధిలో పులులు ఇతర వన్యప్రాణుల సంరక్షణ కోసం ఇప్పుడున్న సిబ్బంది, అధికారులకు క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. సరిపడా సిబ్బంది లేమితోపాటు పని ఒత్తిడితో ఉన్నారు. చాలా చోట్ల ఖాళీలు ఉన్నాయి. ఇక పులి సంచారం ఉన్న చోట్ల వేటగాళ్ల నిరోధం, ముప్పు తప్పించేందుకు అటవీ అధికారులు శ్రమించాల్సి వస్తోంది. ప్రతీ ఏటా పులులు ఏదో కారణంగా ఇక్కడ మృత్యువాత పడుతున్నాయి. విద్యుత్ కంచెలు, వేటతో ప్రమాదంలో పడుతున్నాయి. కాగజ్‌నగర్, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లా పరిధిలో పులులు ప్రాణాలు కోల్పోయాయి. క్షేత్రస్థాయిలో పటిష్ట నిఘా లోపం ఏర్పడుతోంది. పులుల సంరక్షణ కోసమే దళం ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో పులుల సంతతి పెంపునకు ఉపయోగపడనుంది.

కవ్వాల్ అభయారణ్యం వివరాలు(చ.కి.మీ)

కోర్	892.23
బఫర్	1123.21
మొత్తం విస్తీర్ణం	2015.44

కొర్రమీను సాగుకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅగ్రికల్చర్: కొర్రమీను సాగుకు ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్.అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాను ముర్రెల్ క్లస్టర్‌గా ఏర్పాటుకు గుర్తించారని, ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో భాగంగా సాధారణ కేటగిరీ 40 శాతం, ఎస్సీ, ఎస్టీ మహిళా కేటగిరీ 60శాతం రాయితీపై మూడు హ్యాచరీ యూనిట్లు, 10హెక్టార్ల చేపల పెంప కంచెరువులు మంజూరు చేస్తామని తెలిపారు. మత్స్యకారులు, మత్స్యరైతులు, హోల్‌సేల్, రిటైల్ చేపల విక్రయదారులు, చేపపిల్లలు ఉత్పత్తి చేసేవారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు కలెక్టరేట్‌లోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సబ్‌స్టేషన్ సందర్శించిన ఎస్‌ఈ

బెల్లంపల్లి: బెల్లంపల్లి శివాలయం ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎన్‌పీడీసీఎల్ ఎస్‌ఈ గంగాధర్ సోమవారం సందర్శించారు. ప్రస్తుత వేసవికాలంలో పెరుగుతున్న విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా సేవలకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు కొత్తగా 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో డిమాండ్‌కు అనుగుణంగా కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుండడంతో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. ఈ మేరకు ఆ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి ఎస్‌ఈ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారులు, సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఈ రాజన్న, డీఈ(టెక్నికల్) కైసర్, ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంపు

- కేజీబీవీల్లో బాలికలకు ప్రయోజనం
- భోజన నిర్వహణకు తొలగిన అడ్డంకులు



తరగతి గదిలో బాలికలు

మంచిర్యాలఅర్బన్: సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాసంస్థల్లో పెంచిన డైట్, కాస్మెటిక్ చార్జీలు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయ(కేజీబీవీ)ల్లోనూ అమలుకు ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు పౌష్టికాహారం, కాస్మెటిక్ చార్జీల అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఇదివరకు అన్ని తరగతులకు కలిపి రూ.1,225 చెల్లిస్తుండగా.. ప్రస్తుతం తరగతుల వారీగా మెనూ, కాస్మెటిక్ చార్జీలు పెంచారు. 6, 7వ తరగతులకు రూ.1,330, 8వ, 9వ, 10వ తరగతులకు రూ.1,540, ఇంటర్ బాలికలకు రూ.2,100 డైట్ చార్జీలు ఉన్నాయి. కాస్మెటిక్ చార్జీలు 6నుంచి 8వ తరగతి వరకు రూ.100 నుంచి రూ.175, 8నుంచి 10వ తరగతి ఆపై 11సంవత్సరాల వయస్సు కలిగిన వారందరికీ రూ.100 నుంచి రూ.275కు పెరిగాయి. కానీ ఎప్పటి నుంచి అమలు అవుతుందనేది ఉత్తర్వుల్లో స్పష్టత లేకుండా పోయింది. మరో పదిహేను రోజులు గడిస్తే వేసవి సెలవులు రానున్నాయి. వచ్చే 2025–26 విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తారా అనేది తేలాల్సి ఉంది. ఇటీవల సంక్షేమ వసతిగృహాలు, గురుకుల విద్యాసంస్థల విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచినా కేజీబీవీల్లో పాత చార్జీలే అమలవుతున్నాయి. ప్రభుత్వం చెల్లించే డైట్ చార్జీలకు నిత్యం సరుకులు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌కు చెల్లించే ధరల్లో వ్యత్యాసం ఉండడంతో ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో కేజీబీవీల్లో విద్యార్థినులకు ప్రభుత్వం డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంపుపై హర్షం వ్యక్తమవుతోంది.

మెనూ అమలు ఇలా..

జిల్లాలో 18 కేజీబీవీలు ఉండగా.. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు 4,587 మంది బాలికలు చదువుతున్నారు. బాలికలకు బలవర్ధకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆడపిల్లల్లో రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు ఉండడంతో నెలలో నాలుగుసార్లు చికెన్, రెండుసార్లు మాంసాహారం, పౌష్టికాహారానికి శ్రీకారం చుట్టింది. వారంలో ఆరు రోజులు బుధవారం మినహా అరటిపండు, లేదా సీజనల్ పండ్లు, సేమియా, గులాబ్‌జామ్, అటుకులు మిక్చర్, పల్లిపట్టి, స్నాక్స్, టీ అందించాల్సి ఉంది. ధరల్లో వ్యత్యాసాల వల్ల అరకొర మెనూ అమలు చేయాల్సిన పరిస్థితులు ఎదురయ్యేవి. కొన్ని చోట్ల మటన్ పెట్టిన సందర్భాలు తక్కువే. చికెన్ కూడా అదే పరిస్థితి నెలకొంది. ఇంకోవైపు డైట్ చార్జీలు ఇచ్చేది తక్కువ.. పక్కాగా మెనూ అమలు చేయాలనడంతో తల పట్టుకున్నారు. ప్రభుత్వం చార్జీలు పెంచడం ఉపశమనం కలిగిస్తుంది. చార్జీల పెంపు వల్ల బాలికలకు ప్రయోజనం చేకూరనుందని డీఈవో యాదయ్య తెలిపారు.

బిల్లుల్లో కొంత ఇవ్వాల్సిందే..!

- జిల్లాలోని ఓ సీడీపీవో నిర్వాకం
- అంగన్‌వాడీ టీచర్ల నుంచి వసూలు
- ఇవ్వని వారిపై కఠిన వైఖరి

మంచిర్యాలటౌన్: అంగన్‌వాడీ కేంద్రాల అద్దె బిల్లుల్లో ఓ సీడీపీవో వసూళ్ల పర్వానికి తెరతీసింది. కొంత మొత్తం ఇవ్వాల్సిందేనని అంగన్‌వాడీ టీచర్లకు హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో 969 అంగన్‌వాడీ కేంద్రాలు, నాలుగు ప్రాజెక్టులు ఉన్నాయి. ఒక్కో ప్రాజెక్టుకు ఒక సీడీపీవో, సెక్టార్‌కు ఒకరు సూపర్‌వైజర్ ఉన్నారు. ప్రభుత్వ భవనాల్లో 190 అంగన్‌వాడీ కేంద్రాలు, అద్దె లేని భవనాల్లో 289, పూర్తిగా అద్దె చెల్లింపుతో 490 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇందులో అత్యధికంగా మంచిర్యాల ప్రాజెక్టు పరిధిలో 149 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. రాష్ట్ర శిశు, మహిళా, దివ్యాంగ, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా అద్దె చెల్లిస్తుంటారు. ప్రతీ నెల కాకుండా ఏడాదిలో ఒకటి లేదా రెండుసార్లు ఒకేసారి భవన యజమానుల ఖాతాల్లో జమ చేస్తారు. నెలల తరబడి వేచి చూడని యజమానులకు అంగన్‌వాడీ టీచర్లు ప్రతీ నెల అద్దెను చెల్లిస్తూ సంక్షేమ శాఖ నుంచి రాగానే వారి నుంచి తీసుకుంటున్నారు. గత ఏడాదికి సంబంధించిన తొమ్మిది నెలల అద్దె డబ్బులు ఇటీవల విడుదలయ్యాయి. దీంతో ఓ ప్రాజెక్టు సీడీపీవో అద్దెలో నుంచి ఒక్కో టీచర్ నెలకు రూ.200 చొప్పున తొమ్మిది నెలలకు సంబంధించి మొత్తంగా రూ.1800 ఇవ్వాలని హుకుం జారీ చేయడం చర్చనీయాశంగా మారింది. డబ్బులను జమ చేసి ఇచ్చేలా ఒక్కో ఏరియా నుంచి ఒక్కో టీచర్‌కు బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. ఫోన్ పే, గూగుల్ పే వద్దని డిమాండ్ చేయడంతో ఇప్పటికే సగం మంది డబ్బులు చెల్లించినట్లు తెలుస్తోంది. డబ్బుల వసూలుకు డ్రైవర్‌ను వినియోగిస్తుండగా.. డ్రైవర్‌కు కొందరు ఫోన్ పే చేస్తున్నారు. కొందరు మాత్రం యజమానుల ఖాతాకే వెళ్తున్నాయని తామెలా ఇస్తామని ప్రశ్నించడంతో ఆయా టీచర్లపై కక్షసాధింపుగా వ్యవహరిస్తున్నట్లు వాపోతున్నారు.

ఇతర వాటిలోనూ..

అంగన్‌వాడీ కేంద్రాలకు ఏడాదికోసారి స్టేషనరీ కోసం రూ.వెయ్యి ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంటుంది. గత కొన్నేళ్లుగా స్టేషనరీ బిల్లులు రాకపోయినా టీచర్లు అవసరమైన వాటిని సొంతంగా కొనుగోలు చేస్తున్నారు. ఇటీవల గత ఏడాదికి సంబంధించిన స్టేషనరీ బిల్లు టీచర్లకు రూ.వెయ్యి చొప్పున రాగా.. అందులో నుంచి రూ.150 చొప్పున ఇవ్వాలని, పోషణ్ అభియాన్ కింద ఇటీవల రూ.15వేలు మంజూరు కాగా.. రూ.5వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది. మేలో వేసవి సెలవుల నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాలు మూతపడకుండా 15 రోజులు ఆయాలు, మరో 15 రోజులు టీచర్లు తెరిచేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఎండలతో పిల్లలు కేంద్రాలకు రాకపోవడంతో పోషకాహారాన్ని నేరుగా పంపిణీ చేస్తూ కేంద్రాలను అప్పుడప్పుడు తెరుస్తుంటారు. దీంతో మే నెల రాకముందే ఒక్కో కేంద్రం నుంచి రూ.1000 చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం జిల్లాలో సీడీపీవో వ్యవహారం చర్చనీయాంశంగా మారగా.. కొన్ని ఆడియోలు వైరల్ అవుతుండడం గమనార్హం. ఉన్నతాధికారులు దృష్టి సారించి డబ్బులు వసూలు చేస్తున్న వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ పెరుగుతోంది.

ప్రాజెక్టుల వారీగా జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

ప్రాజెక్టు	స్వంత భవనాలు	రెంట్ ఫ్రీ భవనాలు	అద్దె భవనాలు
బెల్లంపల్లి	76	80	123
చెన్నూరు	43	75	127
లక్సెట్టిపేట	38	113	91
మంచిర్యాల	33	21	149
మొత్తం	190	289	490

సమస్యలు పరిష్కరించాలి

- బెల్లంపల్లి మున్సిపల్ అధికారుల వేతనాలు ఆపి వేయండి
- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎం ప్రజావాణి, జిల్లా ప్రజావాణిలో వచ్చిన అర్జీదారుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌తో కలిసి అర్జీలు స్వీకరించారు. పింఛన్, భూ సమస్యలు, పరిహారం తదితర వాటిపై పలువురు దరఖాస్తులు సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమానికి హాజరు కాని బెల్లంపల్లి మున్సిపల్ అధికారుల వేతనాలు నిలిపి వేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

చేపలు పట్టుకుంటాం..



తాండూర్ మండలం కాసిపేట రంగసముద్రం చెరువు తూములో మట్టి నిలిచిపోయింది. చెరువు కింద ఈ ఏడాది యాసంగి సాగు కూడా లేదు. చెరువులో చేపలు వృద్ధి చెందాయి. వాటి పట్టుకుని విక్రయించడం మా జీవన ఉపాధి. చెరువులో ఉన్న నీటిని రెండు ఫీట్లు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి. చేపలు పట్టుకోవడానికి అవకాశం కల్పించాలి.

– మత్స్యకారులు, కాసిపేట

రుణమాఫీ కాలేదు..



2022 ఖరీఫ్‌లో ఆవుడం బ్యాంకులో రూ.40 వేలు రుణం తీసుకున్న. తిరిగి 2023 జూన్‌లో వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకున్నాను. మొదటి విడత రూ.లక్షలోపు మాఫీలో కాలేదు. రెండు, మూడు, నాలుగో విడతలో కూడా మాఫీ కాలేదు. ఇంటి పేరు తప్పు పడిందని బ్యాంకు అధికారులు తెలిపారు. వ్యవసాయ అధికారులు సర్వేలో ఫొటో తీసుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. అయినా ఇంతవరకు మాఫీ కాలేదు.

– మడికొండ బాల్‌రాజ్, గ్రామం: కాజిపెల్లి, మం: భీమారం

పింఛన్ రావడం లేదు..



నాకు కొంతకాలం వికలాంగుల పింఛన్ వచ్చింది. మూడు నెలలుగా రావడం లేదు. నా కాళ్లు సచ్చుబడిపోయి నడవలేని స్థితిలో ఉన్నా. పింఛన్‌తోనే బతుకుడు. సదరం సర్టిఫికేట్ తీసుకొస్తేనే పింఛన్ వస్తుందంటున్నారు. సదరం సర్టిఫికేట్ కోసం మీ సేవలో అడుగుతే ఇప్పుడు లేదు అంటున్నారు.

– దుర్గం రామయ్య, వెంకంపేట, చెన్నూర్

ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: యాసంగి ధాన్యం సేకరణకు ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా వ్యవసాయ అధికారి కల్పనతో కలిసి ధాన్యం సేకరణ ఏజెన్సీలు, అధికారులు, మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకానికి రూ.2,300 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఐకేపీ ఆధ్వర్యంలో 104 దొడ్డురకం, 90 సన్నరకం కొనుగోలు కేంద్రాలు, ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 80 దొడ్డురకం, 39 సన్నరకం, మెప్మా ఆధ్వర్యంలో 4 దొడ్డురకం, 2 సన్నరకం కొనుగోలు కేంద్రాలు మొత్తం 319 ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. బ్యాంకు గ్యారంటీ ఇచ్చిన, సీఎంఆర్ డెలివరీ సకాలంలో చేసిన మిల్లులకు మాత్రమే ధాన్యం కేటాయిస్తామని అన్నారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య సభ్యులు, ఏపీఎంలు, సీసీలు, పీఏసీఎస్ కార్యదర్శులు, రైస్‌మిల్లర్ల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన వాల్‌పోస్టర్లను జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి హరీష్‌రాజ్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావుతో కలిసి ఆవిష్కరించారు. ప్రోగ్రాం అధికారులు అనిత, ప్రసాద్, కృపాబాయి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు అభివృద్ధిపై ధ్యాస లేదు

- కార్యకర్తలపై అక్రమ కేసులు సహించబోం
- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



మాట్లాడుతున్న బాల్క సుమన్

బెల్లంపల్లి: బెల్లంపల్లి, చెన్నూర్ ఎమ్మెల్యేలకు మంత్రి పదవులపై ఉన్న ధ్యాస అభివృద్ధిపై లేకుండా పోయిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. సోమవారం బెల్లంపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణకు మొదటి నుంచి కాంగ్రెస్, బీజేపీ తీరని అన్యాయం చేస్తున్నాయని, రాష్ట్రానికి ప్రథమ శత్రువులని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. అక్రమ కేసులు పెడితే ఊరుకోబోమని, ప్రతీ కార్యకర్తకు అండగా ఉండి జిల్లాలో గులాబీ సైనికులుగా తయారు చేస్తామని అన్నారు. ప్రజాస్వామ్యంలో అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమ కేసులపై రామగుండం కమిషనరేట్ ముట్టడిస్తామని అన్నారు. ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, నాయకులు టి.సత్యనారాయణ, కోళి వేణుమాధవ్, బత్తుల సుదర్శన్, నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): తెలంగాణలో కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆరోపించారు. సోమవారం క్యాతన్‌పల్లిలోని తన నివాసంలో పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెన్నూర్ నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి పనులు ఇంతవరకు పూర్తి చేయలేదన్నారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యే వివేక్ ఇచ్చిన నిరుద్యోగ యువతకు 45 వేల ఉద్యోగాల హామీ ఏమైందని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ సభకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్‌ఎస్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జేసీబీ సీజ్

జన్నారం: రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా మొరం తవ్వుతున్న జేసీబీని సీజ్ చేసినట్లు ఇందన్‌పల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం దస్తురాబాద్ మండలం బుట్టాపూర్ గ్రామ సమీపంలోని రిజర్వ్‌ఫారెస్ట్‌లో మొరం తవ్వుతున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి అక్కడికి వెళ్లారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా మట్టి తవ్వుతున్న జేసీబీని సీజ్ చేయడంతో పాటు జేసీబీ యజమాని మహేశ్‌పై కేసు నమోదు చేశారు. అనంతరం రూ.55,000 జరిమానా విధించినట్లు రేంజ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు.

కోర్టు నోటీస్ ధిక్కరణ.. మహిళకు జైలు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్ గ్రామానికి చెందిన గుగ్లావత్ వందన కోర్టు నోటీస్ ధిక్కరించిన కేసులో రిమాండ్‌కు తరలించినట్లు నిర్మల్ ఎక్సైజ్ సీఐ రంగస్వామి, ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఎక్బాల్‌పూర్ గ్రామానికి చెందిన వందన గతంలో నాటు సారా విక్రయిస్తూ పట్టుబడింది. ఆమెపై కేసు నమోదు చేసి, చార్జిషీట్ వేసి కోర్టుకు హాజరు కావాలని కోర్టు నోటీస్ ఇచ్చారు. అయినా ఆమె కోర్టుకు హాజరు కాలేదు. దీంతో ఖానాపూర్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో ఆమెను సోమవారం అరెస్ట్ చేసి కోర్టు ఎదుట హాజరుపర్చారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ వందనకు 10రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించడంతో ఆదిలాబాద్ జైలుకు తరలించినట్లు వారు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం దొంగ పట్టివేత


పట్టుబడిన దొంగతో పోలీసులు

ముధోల్: మండల కేంద్రంలోని స్థానిక కాల్వగల్లీలో ద్విచక్రవాహనం దొంగతనం చేసిన వ్యక్తిని కాలనీవాసులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. కాలనీవాసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మండల కేంద్రంలోని కాల్వగల్లీలో ఉన్న హనుమాన్ ఆలయంలో హుండీ దొంగతనం చేసేందుకు దొంగ విఫలయత్నం చేశాడు. అనంతరం అదే గల్లీలో ఉన్న ద్విచక్రవాహనాన్ని దొంగిలించి వెళ్తుండగా కాలనీవాసులు పట్టుకున్నారు. ఎస్సై సంజీవ్‌కుమార్‌కు సమాచారం అందించగా సంఘటన స్థలానికి పోలీసులు చేరుకున్నారు. వారికి కాలనీవాసులు దొంగను అప్పగించారు. దొంగను బాసర మండల కేంద్రానికి చెందిన లక్ష్మణ్‌గా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ భూమిలో ఇళ్లు కడుతున్న ఇద్దరిపై కేసు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ షంషీర్ నగర్‌లో సర్వే నంబర్ 170లోని ప్రభుత్వ భూమిలో ఇళ్లు కడుతున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో ఎన్.దేవయ్య తెలిపారు. మహబూబీ, అమానుల్లాఖాన్ అనే ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ఇంటి నిర్మాణం చేస్తున్నారని, వీరిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు వారిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు.

మరో తడిపై రైతుల ఆశలు

- రేపటి వరకు ఏడు తడులు పూర్తి
- పొట్టదశలో వరి పంట
- యాసంగి సాగు ఆలస్యంతో సమస్య
- ఆందోళనలో సదర్‌మట్ ఆయకట్టు రైతులు



కడెం: సదర్‌మట్ ఆయకట్టు ద్వారా ఖానాపూర్, కడెం మండలాలకు ఏటా ఏడు తడుల నీటిని వారబందీ పద్ధతిన అధికారులు విడుదల చేస్తున్నారు. ఏప్రిల్ 9తో ఏడు తడులు పూర్తికావడంతో నీటి విడుదల నిలిపివేయనున్నారు. ఈనేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉందని ఈసమయంలో సాగు నీటిని అందించకుంటే పెద్దఎత్తున నష్టం వాటిల్లుతుందని వాపోతున్నారు. ఆయకట్టుకు మరోతడి సాగు నీరు అందించి పంటను కాపాడాలని వేడుకుంటున్నారు. కాగా సదర్‌మట్ ఆయకట్టు ద్వారా ఖానాపూర్, కడెం మండలాల్లో 13వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈఏడాది యాసంగిలో నాట్లు కాస్త ఆలస్యం కావడంతో సాగు నీటి సమస్య ఉత్పన్నమవుతోంది.

ఏడు తడులు..

సదర్‌మట్ ఆయకట్టుకు జనవరి 2 నుంచి వారబందీ పద్ధతిన (ఏడు రోజులు నీటి విడుదల, ఎనిమిది రోజులు నిలిపివేత) ఏప్రిల్ 9వరకు ఏడు తడుల నీటిని అందిస్తున్నారు. సదర్‌మట్ కేటాయించింది 600 క్యూసెక్కులు కాగ, పైనుంచి మాత్రం 360, 450 క్యూసెక్కుల చొప్పున నీటిని మాత్రమే విడుదల చేశారు. దీంతో కడెం మండలంలోని పాతమద్దిపడగ, కొత్తమద్దిపడగ, పెద్దూర్, వకీల్‌నగర్, చిట్యాల్ తదితర గ్రామాలకు సక్రమంగా సాగు నీరందక కొన్ని చోట్ల పంటలు ఎండిపోయాయి. ఇటీవల ఆయకట్టును పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్ ఏప్రిల్ చివరి వరకు సాగు నీరందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేయడంతో రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. ఎస్సారెస్పీలో నీటిమట్టం తగ్గడంతో తాగునీటి అవసరాల దష్ట్యా మరో తడిని అందిస్తారో లేదో అని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్, నీటిపారుదల శాఖ సీఈ స్పందించి మరో తడిని అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

పంటలు ఎండిపోతాయి..



సదర్‌మట్ చివరి ఆయకట్టు మాది. కాలువ నీరు సరిపడా అందక పంటలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వరి పొట్టదశలో ఉన్నందున మరో తడి నీటిని అందిస్తేనే పంటలు చేతికందుతాయి.

– ధర్మాజీ రమేశ్, రైతు, చిట్యాల్

మరోతడి సాగు నీరందించాలి..



సదర్‌మట్ ఆయకట్టుకు ఏప్రిల్ చివరి వరకు సాగు నీరందించాలి. సాగు నీరందకపోతే పంటలు ఎండిపోయి రైతులు నష్టపోతారు. సాగు నీటిని విడుదల చేయకుంటే రైతుల పక్షాన పోరాడుతాం.

– హపవత్ రాజేందర్, రైతు నాయకుడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



సదర్‌మట్ కింద ఈ ఏడాది యాసంగి పంటల సాగు ఆలస్యమవడంతో సాగు నీటి సమస్య ఏర్పడింది. ఈనెల 9 వరకు ఏడు తడులు నీరందిస్తాం. మరో తడి నీటిని అందించాలని ఆయకట్టు రైతుల కోరుతున్నారు. రైతుల విజ్ఞప్తిని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– విఠల్, ఈఈ, కడెం

కష్టాల కడలి దాటి కవిగా మెరిసి..!

కేవలం ఒక్కపూట భోజనం.. చదువుకోవడానికి ఆరు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాల్సిన పరిస్థితి.. ఆర్థిక ఇబ్బందులు.. ఇవేమి ఆ నిరుపేద యువకుడి లక్ష్యాన్ని అడ్డుకోలేకపోయాయి. కష్టాలను ఎదురొడ్డి చదివిన ఆయన ప్రభుత్వ ఉద్యోగం సాధించి మోటివేషనల్ స్పీకర్‌గా, కవిగా ఎన్నో ప్రశంసలు పొంది అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. అతడే భైంసా మండలం ఇలేగాం గ్రామానికి చెందిన రెడ్ల బాలాజీ. – భైంసా

- కవితలు, వ్యాసాలు, కథలతో సాహిత్యసేవ
- ఎన్నో పురస్కారాలు, ప్రశంసలు
- ఆదర్శంగా నిలుస్తున్న రెడ్ల బాలాజీ


అప్పటి జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రెడ్ల బాలాజీ (ఫైల్)

నిరుపేద కుటుంబ నేపథ్యం..

ఇలేగాం గ్రామానికి చెందిన రెడ్ల దృపతి –పోశెట్టి దంపతులకు తొమ్మిది మంది పిల్లలు. తొమ్మిదో సంతానంగా రెడ్ల బాలాజీ జన్మించారు. పాఠశాలకు ఇచ్చే సెలవు రోజుల్లో తల్లిదండ్రులతో కలిసి వ్యవసాయ పనులకు కూలీగా వెళ్లేవారు. ఇలేగాంలో ఐదవ తరగతి వరకు చదివిన బాలాజీ పక్క ఊరు దేగాంలో 6 నుంచి 10వ తరగతి వరకు చదివారు. ఈ ఐదేళ్లపాటు రోజూ ఆరు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు వెళ్లేవారు. భైంసాలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. ఆ సమయంలోనే పిల్లలకు ట్యూషన్‌లు చెబుతూ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ గుంటూరులో బీఈడీ పూర్తిచేశారు. ఈ క్రమంలోనే పోస్టాఫీసులో బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా ఉద్యోగం సాధించారు.

సాహిత్యంపై మక్కువ..

కవితలు, వ్యాసాలు, కథలు రాస్తూ బాలాజీ అందరికి తనలో ఉన్న సాహిత్యాన్ని పరిచయం చేశారు. ఇప్పటికే ఇలేగాం గ్రామంలో ఉన్న బాపూజీ మహరాజ్ చరిత్ర, గీత శక్తి, వసుధ వాణి, మధుర వాణి, గీతవాణి వంటి ఆధ్యాత్మిక, సామాజిక, ధార్మిక పుస్తకాలు రాశారు. ఆయన రాసిన పుస్తకాలకు వాణీశ్రీ పురస్కారం, నంది పురస్కారం, జాతీయ విశ్వశాంతి పురస్కారాలు లభించాయి. పలు వేదికల్లో రెడ్ల బాలాజీకి స్వర్ణ కంకణం, బంగారు పతకం అందించారు. సాహితీ రత్న, ఆదర్శరత్న, గౌతమి కవి శ్రేష్ఠ, కవి సామ్రాట్ వంటి బిరుదులు అందుకున్నారు. తెలుగు సాహిత్యంలో రాణించిన రెడ్ల బాలాజీకి అప్పటి నిర్మల్ జిల్లా కలెక్టర్ వరుణ్ రెడ్డి ప్రశంసాపత్రం అందించారు. ఇటీవలే ఆయన రచనలకు గాను డే స్ప్రింగ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ద్వారా ప్రముఖ కవి రచయిత డాక్టర్ శ్రీధర్, ప్రముఖ డైరెక్టర్ వి.సముద్ర చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. బాలాజీ తనకు వీలు కలిగినప్పుడల్లా ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను చైతన్యపరుస్తున్నారు. చిన్నప్పుడు తానుపడ్డ కష్టాలు, ఎదురైన అనుభవాలు, ఆర్థిక ఇబ్బందులు వివరించి విద్యార్థులకు ధైర్యం చెబుతున్నారు.

కరెన్సీ సేకరణే హాబీగా..

- విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు


సేకరించిన కరెన్సీతో అనిల్

లక్సెట్టిపేట: మండలంలోని లక్ష్మీపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న అనిల్ కరెన్సీ సేకరణపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాడు. విదేశాల నుంచి ఎవరైనా వచ్చినట్లు తెలిసినా, వివిధ ప్రదేశాలకు వెళ్లినప్పుడు విదేశీయులు కనిపించినా వెంటనే వారి వద్దకు వెళ్లి కరెన్సీని సేకరించి భద్రపరుస్తున్నాడు. ఇప్పటి వరకు తాండూర్, సీతారాంపల్లి, ఆస్నాద్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించగా అక్కడి విద్యార్థులకు వివిధ దేశాల కరెన్సీపై అవగాహన కల్పించారు. కరెన్సీతో పాటు ప్రకృతి, పక్షులు, అందమైన ఫొటోలు తీయడం అతని హాబీగా మార్చుకున్నాడు.

31 దేశాల కరెన్సీ సేకరణ

2008 నుంచి ఇప్పటి వరకు 31 దేశాల కరెన్సీ సేకరించి సేకరించాడు. వివిధ దేశాల కరెన్సీ పేర్లు, వాటి విలువలు విద్యార్థులకు తెలియపర్చేందుకు కరెన్సీని సేకరిస్తున్నట్లు ఆయన పేర్కొంటున్నాడు. విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లినా కాంపిటేటివ్ పరీక్షల్లో ఉపయోగకరంగా ఉండేందుకు భారతదేశంలో ఇప్పటి వరకు ఉన్న పాత, కొత్త కరెన్సీలను భద్రపరుస్తున్నాడు. ఖాళీగా ఉన్న సమయంలో ఇతర ప్రాంతాలకు వెళ్లి కరెన్సీ సేకరించడం, ఫొటోలు తీయడంపై దృష్టి పెడుతున్నాడు. విద్యార్థులకు పాఠాలతో పాటు ప్రకృతి, వాటి విలువలు, కరెన్సీ, ఇతర విషయాలపై అవగాహన కల్పిస్తున్నాడు.

అవగాహన కల్పించేందుకే..

విద్యార్థులకు అవగాహన కల్పించేందుకే వివిధ దేశాల కరెన్సీ సేకరిస్తున్నా. కరెన్సీ సేకరణ, ఫొటోలు తీయడం హాబీగా ఎంచుకున్నా. విద్యార్థులకు పాఠాలతో పాటు కరెన్సీపై అవగాహన కల్పిస్తున్నా.

– అనిల్, ఉపాధ్యాయుడు

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

- కాల్‌టెక్స్ ఇళ్ల చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- మరో ముగ్గురి కోసం బృందాల గాలింపు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రవికుమార్


వివరాలు తెలియజేస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లి: సంచలనం సృష్టించిన బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలోని రెండిళ్లలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. నలుగురు నిందితుల్లో ఒకరిని అరెస్టు చేసి దొంగిలించిన నాలుగు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం బెల్లంపల్లి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఏ.రవికుమార్ వివరాలు వెల్లడించారు. గత నెల 29వ తేదీ తెల్లవారుజామున బెల్లంపల్లి కాల్‌టెక్స్ ఏరియాలో సాన శ్రావణ్, అత్తె సుధాకర్ ఇళ్లలో ఆగంతకులు దొంగతనానికి పాల్పడ్డారు. ఇళ్ల తాళాలు పగులగొట్టి 14.5 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.20 వేల నగదు, నాలుగు మోటారు సైకిళ్లను దొంగిలించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతను గజానంద్ పార్థి అని కాల్‌టెక్స్ ఏరియాలో దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. మరో ముగ్గురు నిందితులు లాల్‌జీ, రోషన్, ఘోటియా పరారీలో ఉన్నట్లు ఏసీపీ వెల్లడించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం గుణా జిల్లా కనేరా గ్రామానికి చెందిన నలుగురు సభ్యుల అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఇళ్లలో చోరీ చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని, త్వరలోనే పట్టుకుంటామన్నారు.

పలు రాష్ట్రాల్లో నిందితులపై కేసులు

మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన నలుగురు దొంగలు తాళం వేసి ఉన్న ఇళ్లతో పాటు ఇంట్లో కుటుంబ సభ్యులు ఉన్నా కూడా చోరీ చేస్తున్నట్లు దర్యాప్తులో తేల్చారు. నిందితులు మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో దొంగతనాలు చేస్తూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకుంటున్నారు. వీరిపై ఆయా రాష్ట్రాల్లో దొంగతనం కేసులు నమోదై ఉన్నాయి. నిందితుడిని పట్టుకున్న బెల్లంపల్లి రూరల్‌సీఐ అఫ్జలుద్దీన్, టూటౌన్ ఎస్సై కె.మహేందర్, తాళ్ల గురిజాల ఎస్సై సీహెచ్ రమేశ్, నెన్నెల ఎస్సై ప్రసాద్, పోలీసు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'


మాట్లాడుతున్న బీట్ అధికారి రుబీనా

జన్నారం: అడవి నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకోగా విధులకు ఆటంకం కలిగించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జన్నారం అటవీ డివిజన్, ఇందన్‌పల్లి రేంజ్ భర్తన్‌పేట్ బీట్ అధికారి రుబీనా తలత్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఎఫ్ఎస్‌వో హన్మంతరావుతో కలిసి మాట్లాడారు. ఈనెల 4న భర్తన్‌పేట్ బీట్ పరిధిలో విధుల్లో భాగంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకోగా ఎజాజోద్దీన్ అనే వ్యక్తి తనను దుర్భాషలాడారన్నారు. ట్రాక్టర్‌ను రేంజ్‌కు తరలిస్తుండగా కొత్తపేట్ గ్రామ సమీపంలో అడ్డం తిరిగి రియాజోద్దీన్ అనే మరో వ్యక్తి తన చేయి పట్టుకొని లాగడంతో పాటు కర్రతో కొట్టినట్లు తెలిపారు. అడ్డు వచ్చిన తన భర్త అఫ్రోజ్‌పై కూడా ఇద్దరు దాడి చేసి గాయపర్చినట్లు పేర్కొన్నారు. కాగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజవర్ధన్ ఇద్దరిపై కేసు నమోదు చేశారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రజల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను స్వీకరించారు. ఉట్నూర్ మండలం చాందూరి గ్రామానికి చెందిన పోసుబాయి తనకి ఏదైనా అంగన్వాడీ సెంటర్‌లో ఉద్యోగం కల్పించాలని, తాండూర్ మండలం గోపాల్‌నగర్ గ్రామానికి చెందిన గట్ల నర్సయ్య తనకి మేకల లోన్, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించాలని, నేరెగొండ మండలం కుంటాల గ్రామానికి చెందిన సిడాం లక్ష్మి తనకు ఏదైనా ఆశ్రమ పాఠశాలలో ఆశ వర్కర్ ఉద్యోగం కల్పించాలని కోరారు. వీరితో పాటు పలు గ్రామాల నుంచి వచ్చిన వారు పింఛన్, రెండు పడకల గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయం, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు సమర్పించారు. ఏవో దామదర స్వామి, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, పీహెచ్‌వో సందీప్, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఐడియా టవరంటూ టోకరా

- రూ.72,600 మోసపోయిన బాధితులు


మోసపోయిన బాధితులు

ముధోల్: వ్యవసాయ భూమిలో ఐడియా టవర్ ఏర్పాటు చేసుకుంటే రూ.25 లక్షలు ఇస్తామని ఫోన్‌లో మాయమాటలు చెప్పి రూ.72600లు కాజేసిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామానికి చెందిన బాధితుడు సత్తి రాములు, భార్య లలితలకు ఈనెల 2వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి పంట పొలంలో ఐడియా టవర్ ఏర్పాటు చేసుకుంటే కంపెనీ ద్వారా రూ.25లక్షలు అందజేస్తామన్నారు. అయితే బాండ్ రూపొందించేందుకు ముందుగా డబ్బులు కట్టాలని తెలిపారు. దీంతో బాధితులు విడతల వారీగా 3, 4వ తేదీల్లో మొత్తం రూ.72,600 చెల్లించారు. దీంతో సత్తి రాములు పేరుమీదుగా రూ. 25లక్షల 11 పేజీల బాండ్ పంపించారు. అనంతరం వారి నుంచి ఎలాంటి ఫోన్ రాకపోవడంతో మోసపోయినట్లుగా గుర్తించి బాధితులు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న వారిపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పశువులను అక్రమంగా రవాణా చేస్తున్న 13 మందిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం తెల్లవారుజామున సిర్పూర్ మార్కెట్ నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్న 13 మందిని, బొలేరో వాహనాలను పట్టుకున్నామని తెలిపారు. జగిత్యాల జిల్లా చిల్వకొండూరు గ్రామానికి చెందిన సిరాజ్, రియాజ్, సాజిద్, పెద్దపల్లి జిల్లా పెద్దాపూర్ గ్రామానికి చెందిన పైడిపాల రవి, జగిత్యాల జిల్లా రామడామినిపెల్లి గ్రామానికి చెందిన గుంటకుల మహేందర్, చింతకొండి స్వామి, కోష్టపల్లి గ్రామానికి చెందిన గుంటకుల రమేశ్, రామడామినిపెల్లి గ్రామానికి మటేటి మహేందర్, మటేటి రాము, దమ్మమ్మపేట గ్రామానికి ఉప్పడ నర్సయ్య, పెద్దపల్లి జిల్లా నందిమేడారం గ్రామానికి చెందిన ఆవునూరి తిరుపతి, బంజారపల్లి గ్రామానికి చెందిన నూనవత్ సంతోష్, బంజారపల్లి గ్రామానికి చెందిన ఎస్లావత్ జితేందర్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పట్టుకున్న పశువులను త్రిశూల్ పహాడ్ గోశాలకు తరలించామన్నారు.

అడవిపందులు తరలిస్తున్న ముగ్గురిపై కేసు


నిందితులతో అటవీశాఖ అధికారులు

భైంసాటౌన్: అడవి పందులను అక్రమంగా తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు భైంసా ఎఫ్ఆర్‌వో సట్ల వేణుగోపాల్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన కొందరు నియోజకవర్గంలో అడవి పందులను వేటాడి తరలిస్తున్నారన్న సమాచారంతో సోమవారం ముధోల్ మండలం బోరిగాం వద్ద తనిఖీలు చేపట్టారు. మహారాష్ట్రలోని హింగోలి జిల్లా కట్ట గ్రామానికి చెందిన జాదవ్ సంజయ్, జాదవ్ అనిల్, పర్బని జిల్లా పూర్ణకు చెందిన కృష్ణ అనే ముగ్గురు వ్యక్తులు బొలెరో వాహనంలో 13 అడవి పందులను తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు పందులను స్వాధీనం చేసుకుని అడవిలో వదిలేసినట్లు తెలిపారు. నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో వెల్లడించారు. డీఆర్‌వో శంకర్, ముధోల్ ఎస్సై లక్ష్మణ్, మొగ్లి, దొడర్న వీవోలు కృష్ణ, లెనిన్ ఉన్నారు.

పసుపు పంట దొంగతనం.. వ్యక్తి రిమాండ్


శ్రీనివాస్

లక్ష్మణచాంద: పసుపు పంటను దొంగతనం చేసి విక్రయిస్తూ వ్యక్తి పట్టుబడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పలు గ్రామాలలో గత కొన్ని రోజులుగా పసుపు పంట దొంగతనం జరుగుతోంది. రెండు రోజుల క్రితం మండల కేంద్రానికి చెందిన బొగడమీది ముత్తన్న అనే రైతు పసుపు పంట దొంగతనం జరిగినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసే క్రమంలో సోమవారం మండలంలోని పొట్టపెల్లి గ్రామానికి చెందిన మాచిట్ల శ్రీనివాస్ మండలంలోని కనకపూర్‌లోని ఖలీల్ ట్రేడర్‌షాప్‌లో పసుపు పంట విక్రయిస్తూ పట్టుపడ్డాడు. అతడిని విచారించగా తాను పసుపు పంటను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో కేసు నమోదు చేసి అతడిని రిమాండ్‌కు తరలించినట్లు శిక్షణ ఎస్సై జుబేర్ తెలిపారు.

భూతగాదాల్లో ముగ్గురికి జైలు

భీమారం: భూ తగాదాల్లో మండలంలోని మద్దికల్ గ్రామానికి చెందిన చిలకాని కనకయ్య, చిలకాని మాదయ్య, బండం శ్రీనివాస్‌లకు సంవత్సరం జైలుశిక్ష విధిస్తూ చెన్నూర్ కోర్టు న్యాయమూర్తి పర్వతపు రవి సోమవారం తీర్పునిచ్చినట్లు ఎస్సై శ్వేత తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. మద్దికల్ శివారులో దాహగామ ఉమామహేశ్వర్‌రావుకు చెందిన భూమిలో 16, ఫిబ్రవరి, 2018లో ట్రాక్టర్ ద్వారా దున్నుతుండగా అదే గ్రామానికి చెందిన కనకయ్య, మాదయ్య, శ్రీనివాస్‌లు వెళ్లి దున్నడం ఆపాలని, లేకుంటే చంపేస్తామని బెదిరించారు. పోలీస్‌స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి కోర్టులో 10 మంది సాక్షులను ప్రవేశ పెట్టారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి జైలుశిక్ష విధించినట్లు ఎస్సై తెలిపారు.

'నీతి ఆయోగ్'లో నార్నూర్ ముందంజ


డిజిటల్ తరగతులు పరిశీలిస్తున్న మనోజ్‌సింగ్ బోరా

నార్నూర్: నీతి ఆయోగ్ 'ఆకాంక్ష' బ్లాక్‌లో నార్నూర్ మండలం ఎంపికై అభివృద్ధి సాధిస్తుందని, మొదటి 30 బ్లాక్‌లల్లో మొదటి స్థానంలో ఉందని ఆకాంక్ష డైరెక్టర్ మనోజ్‌సింగ్ బోరా అన్నారు. ఆయన సోమవారం తన బృందంతో కలిసి మండలంలోని జామ్‌డా, గుంజాల గ్రామాల్లో పర్యటించారు. జామ్‌డాలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన బృందం సందర్శించింది. విద్యార్థినులు వీక్షిస్తున్న డిజిటల్ తరగతులను బృందం డైరెక్టర్ మనోజ్‌సింగ్‌బోరా పరిశీలించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రతినిధులు అనిల్ చహ్వాణ్, కే బాషా, జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో రాజేశ్వర్ రాథోడ్, డీఆర్డీవో రవీందర్ రాథోడ్, పీడీ మిల్కా, సీడీపీవో శారద, సూపరింటెండెంట్ గంగాసింగ్ రాథోడ్, ఎంపీవో సాయి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అడవి పంది దాడి.. ఒకరికి గాయాలు

ఇచ్చోడ: అడవిపంది దాడిలో ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. అడేగామ(కే)లో బద్దం రమేశ్ రెడ్డి వద్ద పాలేరు పని చేసే గణపతి వ్యవసాయ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా అడవి పంది దాడి చేయడంతో గణపతి తీవ్రంగా గాయపడ్డాడు.

ఆర్జీయూకేటీలో ముగిసిన చెస్ పోటీలు

బాసర: ఆర్జీయూకేటీ బాసర క్యాంపస్‌లో రెండు రోజుల పాటు జరిగిన చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. గ్రామీణ యువతలో చెస్ ఆటపై ఆసక్తి పెంపొందించాలనే ఉద్దేశంతో చెస్ నెట్‌వర్క్ సంస్థ, గ్యాప్‌స్కిల్స్ లెర్నింగ్ సొల్యూషన్స్ సహకారంతో టోర్నమెంట్ నిర్వహించింది. ఆర్జీయూకేటీ వీసీ ప్రొఫెసర్ ఎ. గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీధర్షన్, ఏవో రణధీర్లతో కలిసి ముగింపు సమావేశానికి హాజరయ్యారు. గోవర్ధన్ మాట్లాడుతూ పోటీల్లో సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. చెస్ నెట్‌వర్క్ స్థాపక సభ్యుడు సుధీర్ కొధాటి మాట్లాడుతూ, చెస్ ఆట సాంస్కృతిక చైతన్యం తీసుకొస్తుందన్నారు. కార్యక్రమంలో చెస్ నెట్‌వర్క్ ప్రతినిధులు సంజయ్ గజ్జల, హరి, రాజన్న, కిరణ్ మర్రెడ్డి, ఆర్జీయూకేటీ స్పోర్ట్స్ అధికారులు ప్రభాకర్ రావు, పీడీ శ్యాంబాబు, పీఈటీలు వసంత, విద్యార్థులు పాల్గొన్నారు.



పోటీలో గెలుపొందిన విద్యార్థులతో ఇన్‌చార్జి వీసీ గోవర్ధన్